RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 97 మంగళవారం 13-08-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స నామినేషన్

**వైసిపికి పూర్ణ బలం ఉందని వెల్లడి**

విశాఖపట్టణం,ఆగస్ట్12 : విశాఖ వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. వైజాగ్ కలెక్టరేట్‌లో సోమవారం తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీకి పూర్తి బలం ఉందని బొత్స సత్యనారాయణ తెలిపారు. 838 ఓట్లలో 500 పైచిలుకు తమకు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ పోటీ పడుతుందని తాను అనుకోవడం లేదని పేర్కొన్నారు. వైసీపీకి పూర్తి బలం ఉన్నప్పుడు కూటమి అభ్యర్థిని ఎందుకు బరిలో నిలుపుతోందని అన్నారు. వైసీపీకి బలం ఉన్నప్పుడు అనైతికంగా ఎందుకు నిలబెడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాలంటే వ్యాపారం కాదని బొత్స సత్యనారాయణ అన్నారు. మెజార్టీ ఉంది కాబట్టే తాము పోటీ చేస్తున్నామని ఆయన తెలిపారు. తమకు వివాదం అవసరం లేదని చెప్పారు. రాజకీయాల్లో విలువలు అవసరమని హితవుపలికారు. సంఖ్య దగ్గరగా ఉంటే తప్పు లేదు కానీ మెజార్టీ మొత్తం తమకే ఉన్నప్పుడు టీడీపీ అభ్యర్థిని నిలబడెతుందని అనుకోవడం లేదన్నారు.

# ఆసుపత్రులను భ్రష్టు పట్టించిన జగన్

**పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన వైద్య రంగం**

**ప్రభుత్వ ఆసుపత్రులను అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం**

**వైద్యారోగ్య శాఖలో ఉత్తమ విధానాలను అమలు చేయాలి**

**సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలపై ఆగ్రహం**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం**







అమరావతి,ఆగస్ట్12 : గత వైసీపీ పాలనలో ప్రభుత్వాసుపత్రులు భ్రష్టు పట్టాయని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. జగన్ హయాంలో వైద్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. సోమవారం ఆయన అమరావతిలోని తన క్యాంప్ ఆఫీసులో వైద్యారోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను దేశంలోనే అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. వైద్యారోగ్య శాఖలో ఉత్తమ విధానాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వైసీపీ హయాంలో ఆసుపత్రులను భ్రష్టుపట్టించడంతో ప్రజల్లో ప్రభుత్వాసు పత్రులపై నమ్మకం సన్నగిల్లిందని బాబు పేర్కొన్నారు. 'దేశంలోనే బెస్ట్ హాస్పిటల్స్‌గా సర్కారు దవాఖానాలను తీర్చిదిద్దండి. వైద్యారోగ్య శాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయండి. టెలి మెడిసిన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించండి. గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను పట్టించుకోలేదు. దీంతో ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. ప్రజలందరికీ మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించాలి. కిడ్నీ బాధితుల వివరాలు మండలాల వారీగా సేకరించాలి.అన్ని ఆసుపత్రులలో పరిశుభ్రత తప్పని సరి. రోగులకు శుభ్రమైన బెడ్ షీట్లు అందించాలి. మారుమూల ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్య సదుపాయం అందాలి. ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా రోగులను తరలించాలి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా తదితర వ్యాధులకు అరికట్టే మందులను అందుబాటులో ఉంచుకోవాలి. క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వాసుపత్రులను ఆదర్శనీయంగా తీర్చిదిద్దాలని బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రులను దేశంలోనే బెస్ట్ హాస్పిటల్స్‌గా తీర్చిదిద్దాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. 'వైద్యారోగ్యశాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయండి. టెలీ మెడిసిన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలంది ంచండి. గత ప్రభుత్వం ప్రభుత్వా సుపత్రులను భ్రష్టు పట్టించింది. ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత తప్పనిసరి. రోగులకు శుభ్రమైన బెడ్‌షీట్లు అందించాలి. రాష్ట్రంలో ఎక్కడా డోలీ మోతలు కనిపించొద్దు. ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా రోగులను తరలించాలి. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి' అని సూచించారు. నకిలీ సదరం ధ్రువపత్రాలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. నకిలీ సదరం సర్టిఫికెట్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 'అంగవైకల్యం ఉన్నవారికి వివిధ రూపాల్లో పింఛన్లు ఇస్తున్నాం. నకిలీ సదరం ధ్రువపత్రాల జారీపై చర్యలు తీసుకోండి. అలాంటి ధ్రువపత్రాలపై పూర్తి సమాచారం సేకరించండి. పంచాయతీ రాజ్ శాఖ సమన్వయంతో నకిలీ పత్రాలు కట్టడి చేయాలి. ప్రతి నియోజకవర్గంలో పీపీపీ విధానంలో ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం. ఈ ఆస్పత్రికి ప్రభుత్వమే స్థలం ఇస్తుంది. ప్రభుత్వ, పీపీపీ ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తెస్తాం. ప్రభుత్వం తరఫున యాప్ రూపొందించాలి. హెల్త్ కార్డుతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన వ్యక్తి వివరాలు నమోదు చేయాలి. రోగికి అందించే వైద్య సేవలు, మందుల వివరాలు నమోదు కావాలి.

## భద్రతపై రాద్ధాంతం చేస్తున్న జగన్

**సెక్యూరిటీ లేనిదే ప్రజల్లోకి రాలేక పోతున్న మాజీసిఎం**

**రాజమండ్రి సెంట్రల్ జైలును పరిశీలించిన అనిత**

**స్నేహ బ్లాక్‌లో చంద్రబాబును ఉంచిన గది పరిశీలన**

**జైలులో అసౌకర్యాలపై ఉద్వేగానికి గురైన హోంమంత్రి**



రాజమహేంద్రవరం,ఆగస్ట్12 : వైకాపా అధ్యక్షుడు జగన్ సెక్యూరిటీని తాము తగ్గించలేదని.. భద్రత కుదించారంటూ ఆయన అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'సెక్యూరిటీ లేకపోతే ప్రజలు దాడి చేస్తారని జగన్ భయపడుతున్నారని అన్నారు. సిఎంగా ప్రజలను పట్టించుకోలేదని, ఇప్పుడేమో ప్రజల్లోకి రాలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరం జైలును పరిశీలించిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 20 వేల మంది పోలీసుల కొరత ఉంటే ఆయనకు 900 మంది సెక్యూరిటీ కావాలా? మా అధినేత చంద్రబాబు ఎలాంటి తప్పు చేయక పోయినా 53 రోజులు జైలులో పెట్టారు. నేడు పరిస్థితులు తారుమారయ్యాయి. స్నేహ బ్లాక్ వద్దకు వెళ్లాక భావోద్వేగానికి గురయ్యాను. జైలులో ఖైదీల సౌకర్యాలు పరిశీలించాను' అని అనిత తెలిపారు. జగన్ భద్రతను ఎవరూ తొలగించలేదని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. సెక్యూరిటీ లేకపోతే ప్రజలు తిరగబడతారని భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రూల్స్ ప్రకారం మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన భద్రత కల్పించామని చెప్పారు. రాజమండ్రి సెంట్రల్ జైలును హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. జైలు ఆధ్వర్యంలో పెట్రోలు బంక్‌ను ప్రారంభించిన అనంతరం.. సెంట్రల్ జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్నేహ బ్లాక్ వద్దకు వెళ్లాక హోం మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును జైలుకు పంపించడాన్ని ఆమె గుర్తుకు తెచ్చుకున్నారు. తమ నాయకుడిని 53 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజులు గుర్తుకువచ్చి బాధగా అనిపిస్తుందని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమ కేసులకు చంద్రబాబు కూడా బాధితుడిగా మారారని పేర్కొన్నారు. అక్రమ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పాతాళానికి పడిపోయాయని తెలిపారు. వాళ్ల పాపాలు పండాయని.. అందుకే జన నాయకుడిని బాధపెట్టిన వైసీపీని పాతాళానికి తొక్కేలా ప్రజలు బలమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో సెంట్రల్ జైలులో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వంగలపూడి అనిత తెలిపారు. జైలు సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

**ఏలూరులో రైతులకు ధాన్యం బకాయిల చెక్కుల పంపిణీ**

**రైతులకు రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు పెట్టిన జగన్**

**ఇకనుంచి ధన్యాం కొనుగోళ్లు చేసిన 48 గంటల్లో చెల్లింపులు**

**ఏలూరులో రైతులకు బకాయి చెక్కులు అందచేసిన మంత్రి నాదెండ్ల**



ఏలూరు,ఆగస్ట్12: వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులో రైతులకు ధాన్యం బకాయిల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. ఏలూరు, అమలాపురంల్లో రైతులతో నేడు ఆయన సమావేశమయ్యారు.వైకాపా ప్రభుత్వ అరాచకంతో రాష్ట్రం ఆర్థికంగా చాలా వెనుకబడిందన్నారు. రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు ఉంచిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని విడుదల చేయాలని.. ఆమేరకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. కష్టకాలంలో ఉన్నా గత నెలలో రూ.వెయ్యి కోట్లు విడుదల చేశామని.. ఇప్పుడు మిగిలిన రూ.674 కోట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 35,374 మంది రైతుల ఖాతాల్లో రూ.472 కోట్లు వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతులకు గోతాలు కూడా అందజేయలేదని విమర్శించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని మంత్రి చెప్పారు. నష్టపోయిన కౌలు రైతులను ఆదుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏమాత్రం వెనుకాడబోమని.. చివరి గింజ వరకూ కొంటామని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లయిస్‌కు రైతులు ధాన్యం అమ్మారన్నారు. రైతులకు అప్పటి వైసీపీ సర్కారు నగదు చెల్లించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 వేల 724 మంది రైతులకు 1,674 కోట్లు రూపాయలు బకాయిలను జగన్ ప్రభుత్వం పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం మొదటి దశలో 1000 కోట్లను రైతులకు పంపిణీకి ఏర్పాటు చేసిందన్నారు. గత ప్రభుత్వం రైతులను సంక్షోభంలో నెట్టేసిందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు డబ్బులు కూడా చెల్లించలేదన్నారు. రూ. 40,500 కోట్ల రుణాలు సివిల్ సప్లై సంస్థ పేరు మీద గత ప్రభుత్వం రుణాలు తీసుకుందని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్థికంగా చేసిన అరాచకాలకు బ్యాంకులు భయపడిపోయాయన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక తాము ఫోన్ చేస్తుంటే బ్యాంకర్లు ఫోన్లు ఎత్తడం మానేశారని మనోహర్ తెలిపారు. రైతులకు ఎక్కడా ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, ఎటువంటి కష్టాలు లేకుండా పని చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో దళారులు స్వార్థంతో రైతులను ఇబ్బంది పెట్టారని.. వ్యాపారవేత్తలే కాదు.. రైతులు కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చెయ్యాలని.. దానికి అనుగుణంగా చర్యలు చేపట్టామని మనోహర్ పేర్కొన్నారు. +ూబోయే రోజుల్లో రైతులకు ధాన్యం అమ్మిన సొమ్ము 48 గంటల్లో చెల్లిస్తామని మనోహర్ తెలిపారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్లు అందజేస్తామన్నారు. రైతులు మిల్లర్లకు, దళారులకు, వ్యాపారవేత్తలకు భయపడాల్సిన పని లేదన్నారు. గతంలో రైతులకు ఇబ్బందులు కలిగించడానికి ధాన్యం కొనుగోలులో మిల్లుల చుట్టూ తిప్పారన్నారు. కంప్యూటర్ ఇచ్చిన చీటీల వలనే అలా జరిగిందని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారన్నారు. కానీ అవి కంప్యూటర్ చీటీలు కాదని.. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి వైసీపీ చేసిన కుట్ర అని పేర్కొన్నారు. బ్యాంకులకు పౌర సరఫరాల సంస్థ చెల్లించాల్సిన బకాయిల్లో మార్చి 30వ తేదీనాటికి 10 వేల కోట్ల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉంటుందన్నారు. రైతులకు పంట బీమా ప్రీమియంను ఉచితంగా ప్రభుత్వమే చెల్లించేలా యోచన ఉందన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రాజీనామా చేయాలి

**లేకుంటే జగనే రాజీనామా చేయించాలి**

**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి డిమాండ్**

అమరావతి,ఆగస్ట్12: వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దువ్వాడ వ్యవహారంపై ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీనివాస్‌కు కుటుంబం మీద ఏమాత్రం గౌరవం ఉన్నా శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆనం డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి గౌరవంగా అతనిచే రాజీనామా చేయించి ఇంటికి పంపాలని, అలా చేస్తే పార్టీకీ, జగన్‌కు గౌరవం ఉంటుందని హితవు చెప్పారు. శ్రీనివాస్ రాజీనామా చేస్తాడా? లేక జగన్ రాజీనామా చేయిస్తాడా? అని మంత్రి ఆనం ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే వైసీపీకి సమాధి కట్టారని.. ఇక పుష్పగుచ్ఛం ఎవరు గుచ్చాలన్నదే మిగిలి ఉందంటూ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. పెద్దల సభలో ఉన్నవారే ఈ మధ్యకాలం లో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని.. రేపు పెద్దల సభలోకి దువ్వాడ శ్రీనివాస్ ఏ మొహం పెట్టుకుని వచ్చి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇకపోతే గ్రీవెన్స్ సెల్‌కి ఎక్కువ దేవాదాయ శాఖ సంబంధించిన సమస్యలు వచ్చాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. అక్కడక్కడ కొన్ని సమస్యలు పరిష్కరించామని తెలిపారు. తెలుగుదేశం కార్యక్రమంలో సమస్యలతో వచ్చిన వారికి న్యాయం జరిగిందని భరోసా ఇస్తున్నామన్నారు. గ్రీవెన్స్ సెల్ ఒక్క రోజుతో అయిపోయేది కాదని.. ఇది నిరంతర పక్రియ అని మంత్రి చెప్పుకొచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కంటే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లోనే ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని.. అనేక సమస్యలకు గ్రీవెన్స్ సెల్ ద్వారా పరిష్కారం దొరికిందన్నారు.దేవాదాయశాఖకు సంబంధించిన ఆస్తులు అన్నింటిని గుర్తించామని మంత్రి ఆనం తెలిపారు. సెక్షన్ 22జీ1ఇ క్రింద 6,40,000 ఎకరాలు భూములు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇందులో 1,50,000 ఎకరాలు ధూప, దీప నైవేద్యం కింద భూములు ఇచ్చామని.. అవి కూడా కొన్ని అన్యకాంతం అయ్యాయని మంత్రి తెలిపారు. టీటీడీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వైరీ జరుగుతుందన్నారు. గతంలో ఈఓగా పనిచేసిన ధర్మారెడ్డి తిరుమలలో అక్రమాలకు పాల్పడ్డారని మంత్రి అన్నారు. గడిచిన ఐదేళ్లలో తిరుమలలో జరిగిన అక్రమాలపై త్వరలోనే ఒక నివేదిక వస్తుందని.. అది రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని మంత్రి తెలిపారు.

## ఏం జరిగినా జగనే కారణమంటే ఎలా

**తుంగభద్ర గేట్లు కొట్టుకుపోవడంపై అంబటి**

అమరావతి,ఆగస్ట్12: వరద ఉధృతికి తుంగభద్ర గేటు కొట్టుకుపోయిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏం జరిగినా మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర మూడు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అని అంబటి రాంబాబు తెలిపారు. కానీ వైఎస్ జగన్ నిధులు కేటాయించకపోవడం వల్లే కొట్టుకుపోయిందని ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఏది జరిగినా జగన్‌కు అంటగట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు తప్పించుకోవడానికే జగన్‌పై నెపం నెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు వల్లే పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు పోయాయని తెలిపారు. ప్రాజెక్టులపై చంద్రబాబు అమాయకంగా మాట్లాడుతున్నారని అంబటి రాంబాబు విమర్శించారు. కాపర్ డ్యామ్ లేకుండానే చంద్రబాబు పోలవరం నిర్మిస్తానని అంటున్నారని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

**అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ**

హైదరాబాద్,ఆగస్ట్12 : తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ వర్ష సూచన చేసింది. ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తెలంగాణలో 2 రోజుల పాటు వానలు పడతాయని సూచించింది. నిర్మల్, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెంలో వర్షాలు పడతాయని పేర్కొంది. ఇక భాగ్యనగరం హైదరాబాద్‌లో తేలికపాటి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. సికింద్రాబాద్‌లో కూడా వర్షాలు పడతాయని పేర్కొంది.నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వర్షంలో ముందుకు కదలలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఆకాశం మేఘావృతమై ఉంది. భారీ వర్షం కురుస్తుందని ఐఎండీతెలిపింది. ఆదివారం రాత్రి పలుప్రాంతాల్లో రికార్డు స్థాయి వర్షం పడింది. ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంతంలో సుమారు 90 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఎన్‌సీహెచ్ కాలనీలో 87.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడిక్‌మెంట్‌లో 80.8 మిల్లీమీటర్లు.. బౌద్ధనగర్‌లో 80.9. మి.మీ. భారీ వర్షం కురిసింది. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే నాలుగైదు జిల్లాలకు అధికారులు అరెంజ్ అలెర్టు జారీ చేశారు.

# సంపాదకీయం

మంగళవారం 13-08-2024

## ప్రాంతీయ పార్టీలకు సెగ పెడుతున్న మోడీ !

ప్రాంతీయ పార్టీలకు దేశంలో రాజకీయ మనుగడ జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. బిజెపి ముఖ్యంగా మోడీ ద్వయం ఇదే కోరుకుంటోంది. ఈ క్రమంలో దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వారు గట్టిగా నిలదీయలేక పోతున్నారు. దేంలో రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రాంతీయ పార్టీలను కేంద్రం కూడా విశ్వాసంలోకి తీసుకోలేక పోతున్నది. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో ఎలాంటి సమస్యపైనా చర్చ చేయకుండా మమ అనిపించడమే ఇందుకు నిదర్శనం. జిఎస్టీపై నిర్మలా సీతారామన్ తలబిరుసుగా సమాధానం ఇచ్చినా రాష్ట్రాల్లో గట్టిగా నిరసనలు తెలపలేక పోయారు. ప్రజల సమస్యలను నిలదీయడంలో ఈ పార్టీలు విఫలం అవుతున్నాయి. ఇకపోతే దారికి తెచ్చుకునే క్రమంలో జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించు కోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించ డం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజీవ్రాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బ తీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలి గారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. బెయిల్ దొరక్క పోవడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. జార్ఖండ్ సిఎం సోరేన్ ఎలాగో బెయిల్ దక్కించుకుని మళ్లీ పీఠం ఎక్కారు. అయినా వీరికి తాత్కాలిక ఏరట మాత్రమే దక్కింది. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తనయ కూడా బెయిల్ కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్ల గొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం అని భావించారు. మొన్నట ఇపార్లమెంట్ ఎన్నికల్లో ఇది కొంత మేర సఫలం అయ్యింది. అందుకే కాంగ్రెస్ ఎక్కువ సీట్లను దక్కించుకోగలిగింది. అదే సమయంలో బిజెపి తన సీట్లను భారీగా కల్పోయింది. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందు వల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. రాజకీయంగా మరింతగా బలపడేం దుకు మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశ మవుతోంది. 2014లో లోకసభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 10 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. సరికదా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయగలిగారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్ లో టిడిపితో జతకట్టడం ద్వారా బిజెపి లబ్ది పొందింది. తమిళనాడులోని రెండు ప్రాంతీయ పార్టీలూ బీజేపీకి దూరంగా మారాయి. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. తెలంగాణలో మోడీ ఉధృత ప్రచారం చేసినా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అత్తెసరు సీట్లు వచ్చాయి. మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారనే ప్రచారం ఉంది. అందుకు పాలు రాష్ట్రాల్లో నేతలు ఇడి, సిబిఐ కేసుల్లో జైలుకు వెళ్లారు. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. అయితే ఆయన చట్టపరంగా పోరాడి బెయిల్ తెచ్చుకోగలిగారు. ఇప్పుడు ఆయన ఇక తన పోరాటం బిజెపిపైనే అని ప్రకటించారు. అయితే ఏ ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మరించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనుభవాన్ని అవి విస్మరించాయి.

# వైసీపీ రహస్య బంధాలు...

విజయవాడ, ఆగస్టు 12 ఏపీలో వైసీపీ నేతల వ్యక్తిగత వ్యవహారాలు హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. కొద్ది రోజుల కిందట ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యవహారం దుమారం రేపింది. తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి గుట్టు రచ్చకెక్కింది. వైసీపీలో ప్రముఖ నేతల భాగోతాలు ఇలా హైలెట్ అవుతూండటం ఆ పార్టీ ప్రతిష్టను మరింత డ్యామేజ్ చేస్తోంది. గతంతో పవన్ కళ్యాణ్ చట్టబద్దంగా చేసుకున్న వివాహాలపై జగన్ సాగతీస్తూ మరీ సన్నాయి నొక్కులు నొక్కారు. ఇప్పుడు విజయసాయి , శాంతి .. దువ్వాడ శ్రీను, మాధురిల రహస్యబంధాలపై రచ్చ జరుగుతున్నా జగన్ నోరు తెరవడంలేదు. నిజానికి అవేమీ పెద్ద విషయాలు కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అసలు వారి గురించి తెలిసే జగన్ ప్రోత్సహించారని అందుకే ఇప్పుడు బయట పడుతున్నా ఆయన పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తుంది. జగన్‌కు అత్యంత సన్నిహితుడు, పర్సనల్ ఆడిటర్.. జగన్ ఏ-1గా ఉన్న అక్రమాస్తుల కేసుల్లో ఏ-2 నిందితుడిగా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి వ్యవహారం ఇలీవల పెద్ద రచ్చకు దారితీసింది. దేవాదాయ శాఖ ఉద్యోగిని శాంతి భర్తే ఆయనపై స్వయంగా ఆరోపణలు చేశారు. తన భార్యకు పుట్టిన బిడ్డకు కారణం ఆయనేనని.. డీఎన్ఏ టెస్టులు చేయించుకోవాలని సవాల్ చేశారు. దానిపై వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విజయసాయితో అంటకాగిన శాంతి పెట్టిన మీడియా సమావేశం కూడా వైరల్ అయింది. విజయసాయి వ్యవహారంలో అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అన్నింటికీ డీఎన్ఏ టెస్టుతో ఫైనల్ క్లారిటీ వస్తుందని అనుకున్నారు. కానీ విజయసాయిరెడ్డి అందుకు అంగీకరించలేదు. అయితే శాంతి భర్త మాత్రం అదే డిమాండ్ చేస్తూ వచ్చారు. చివరికి విజయసాయిరెడ్డి సుద్దపూసలా సోషల్ మీడియాలో వివరణ ఇచ్చారు. శాంతి చేసిన అన్ని రకాల సాయాలు కూతురిగానే భావించి చేశానని తాను వారింటికి వెళ్లి బిడ్డను ఆశీర్వదించానని.. తన ఇంటికి వస్తే బట్టలు పెట్టానని .. అంతే తప్ప మరేమీ లేదని తండ్రికూతుళ్ల బంధం కలిపేశారు. డీఎన్ఏ టెస్ట్ చేయించుకోవడానికి అంగీకరించకుండా ఆ 67 ఏళ్ల రాజ్యసభ సభ్యుడు లేనిపోని బంధాలు కలుపుతూ వివరణ ఇచ్చి.. సోషల్ మీడియాలో ఇప్పటికీ ట్రోల్ అవుతూనే ఉన్నారుఇక ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ సీరియల్ స్టార్ట్ అయింది. ఒక్క సారి జడ్పీటీసీగా గెలవడం మినహా ఇంకెప్పుడు ఎన్నికల్లో గెలవని దువ్వాడకు జగన్ ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారంటే.. వారిద్దరి సాన్నిహిత్యం అర్థమవుతుంది. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, అచ్చెన్నాయుడులను టార్గెట్ చేయడంలో దువ్వాడ శ్రీనివాస్ ముందుంటారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడేసే దువ్వాడ తీరే జగన్‌ని మెప్పించిందని చెబుతారు. అందుకే



టెక్కలిలో అచ్చెన్నాయుడుపై పోటీకి వైసీపీ నుంచి ముగ్గురు నేతలు పోటీ పడినా జగన్ ఎమ్మెల్సీగా ఉన్న దువ్వాడ వైపే మొగ్గుచూపారంటారు. టికెట్ ప్రకటన సమయానికే దువ్వాడ మరో మహిళతో వివాహేతర బంధం పెట్టుకోవడం వారి కుటుంబంలో చిచ్చుకు కారణమైంది. ఆ విషయాన్ని ఆయన భార్య వాణీ స్వయంగా వెళ్లి జగన్ దగ్గర పంచాయతీ పెట్టారు. దాంతో శ్రీనివాస్‌ని కాదని.. దువ్వాడ వాణిని టెక్కలి ఇన్చార్జ్‌గా ప్రకటించారు ? కానీ జగన్ చివరికి దువ్వాడ శ్రీనివాస్‌కే టిక్కెట్ ప్రకటించారు. ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధమైన దువ్వాడ వాణిని బుజ్జగించారు. అంటే దువ్వాడ ఫ్యామిలీ సర్కస్ గురించి తెలిసి కూడా జగన్ ప్రోత్సహించారన్నమాట. దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం ఇప్పుడు మరింత ముదిరింది. దువ్వాడ శ్రీనివాస్‌కు పెళ్లయి ఇద్దరు కుమార్తెలున్నారు. ఒక కూతురి పెళ్లి కూడా అయింది. ఆయన వయసు కూడా అరవై ఏళ్లకు దగ్గర పడింది. ఇలాంటి సమయంలో ఆయన మరో మహిళతో సహజీవనం చేస్తున్నానని చెప్పకనే చెప్తున్నారు. పైగా అది తప్పని భావించడం లేదంట.. తప్పుగా ఎవరైనా భావిస్తే క్షమించమని చేతులు జోడిస్తున్నారు. ఇప్పటికే దువ్వాడ కుటుంబ కథాచిత్రమ్ రచ్చకెక్కి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. దువ్వాడ ఇంటి ముందు ఆయన కుమార్తెల నిరసనతో మొదలైన వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. దాడులు, ప్రత్యారోపణలు వరకు వెళ్లింది. దువ్వాడ ఇంటి రచ్చ కంటిన్యూ అవుతూనే ఉంది. రెండ్రోజుల క్రితం దువ్వాడ ఇంటి ముందు ఆయన కుమార్తెలు ఆందోళన చేయగా.. ఇప్పుడు ఆయన భార్య వాణి వంతు. అర్ధరాత్రి దువ్వాడ ఇంటికి పెద్దకుమార్తె హైందవితో కలిసి వాణి వెళ్లారు. ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడున్న వారు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దువ్వాడ బయటకు రావాలంటూ రాత్రంతా వాణి అక్కడే బైఠాయించి నిరసన చేపట్టారు. వేరే మహిళతో ఉంటూ తమ గౌరవాన్ని, రాజకీయ జీవితాన్ని మంటగలిపారని మండిపడ్డారు. ఆ టైంలో దువ్వాడ వస్తూనే భార్య వాణిపై పరుష పదజాలంతో పేట్రేగిపోయారు. తిట్ల దండకంతో, బూతుపురాణంతో రెచ్చిపోయారు. గ్రానైట్ రాడ్‌తో భార్య, కూతురిపై దాడికి యత్నించారు. ఇరువర్గాల మోహరింపుతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాగా.. ఇంట్లోకి బలవంతంగా వచ్చే ప్రయత్నం చేశారంటూ వాణి, కుమార్తెలపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు తనపై దాడి చేశారంటూ వాణి కూడా కంప్లైంట్ చేశారు. ఈ ఎపిసోడ్ కొనసాగుతున్న సమయంలోనే.. మాధురి ఎంట్రీ ఇచ్చారు. దువ్వాడ శ్రీనివాస్‌కు, తనకు మధ్య ఉన్నది స్నేహ బంధమే తప్ప మరేమీ కాదని స్పష్టం చేశారు ? వాణి తనపై లేనిపోని నిందలు వేసి రోడ్డుమీదకు లాగడం సరికాదన్నారు. శ్రీనివాస్‌తో తాను ఫ్రెండ్లీ రిలేషన్ షిప్‌లో ఉన్నానని? తాను ఒంటరిగా ఉన్నప్పుడు శ్రీనుకి దగ్గరయ్యాయని తమ బంధం ముున్ముందు ఎటు దారి తీస్తుందో చూడాలని పద్దతి చెప్పుకొస్తున్నారుతమ మధ్య రిలేషన్‌పై దువ్వాడ శ్రీను, మాధురిలు తమ స్టైల్లో క్లారిటీలు ఇచ్చేశారు. మొత్తానికి వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను భాగోతం పెద్ద రచ్చకే దారితీస్తోంది. భార్యబిడ్డలపై రాడ్డుతో దాడి చేయాలని చూసిన ఆయన.. రెండేళ్లుగా వాణి తన భాగోగులు పట్టించుకోలేదని మీడియా ముందు తెగ బాధపడిపోతున్నారు. ఆస్తులన్నీ వాణి, పిల్లలకు రాసిచ్చేసానని ఇప్పుడు మాధురితో ఉన్న ఇంటిని కూడా ఇచ్చేస్తే తన పరిస్థితి ఏంటని విచిత్రంగా సభ్యసమాజాన్ని ప్రశ్నించారు దువ్వాడ వ్యవహారం మొదటి నుంచి తేడాగా ఉండటంతో మీడియా, సోషల్ మీడియాలో అందరూ హైలెట్ చేశారు. కుటంబం కూడా మీడియా ముందుకు వచ్చి నిర్వాకాల గురించి బయట పెట్టింది. దువ్వాడ, మాధురి కలిసి దిగిన ఫోటోలు వైరల్ అయ్యాయి. ఫలితంగా ఇప్పుడు వైసీపీ పరువు మరింత దిగజారి పోతోంది. వైసీపీ అధినేత జగన్ ప్రత్యర్థుల పర్సనల్ లైఫ్‌పై విమర్శలే కాని.. తన పార్టీ నేతల వ్యక్తిగత ప్రవర్తనను అసలు పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లే పార్టీకి ప్రస్తుత దుస్థితి పట్టిందంటున్నారు. అంబటి రాంబాబు ఆడియో టేపులు బయటపడి పెద్ద దుమారం రేగింది. దాని తర్వాత కూడా ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు. దువ్వాడ శ్రీనివాస్ గురించి మొత్తం తెలిసిన తర్వాత కూడా ప్రోత్సహించారు. వైసీపీలో ఇలాంటి ఘన కార్యాలు చేసిన వాళ్లు చాలా మంది ఉన్నారని.. వారి వ్యవహారాలు వరుసగా బయటకు వస్తాయన్న ప్రచారం జరుగుతోంది? అధికారంలో ఉన్నప్పుడే అంబటి రాంబాబు ఆడియో టేపులు బయటకు వచ్చాయి.

# తుంగభద్ర జలాశయానికి వరద



కర్నూలు, ఆగస్టు 12 69ఏళ్ల తుంగభద్ర డ్యామ్ చరిత్రలో ఫస్ట్‌టైమ్ ప్రమాదం జరిగింది. వరద ఉధృతికి 19వ గేట్ కొట్టుకుపోయింది. కొద్దిరోజులుగా ఇన్‌ఫ్లో పెరగడంతో క్రస్ట్‌గేట్లను ఎత్తారు అధికారులు. అయితే, రాత్రి 11గంటల సమయంలో 19వ గేట్ కొట్టుకుపోయినట్టు గుర్తించారు. గేట్ చైన్‌లింగ్ తెగిపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్ నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం గేట్లను 20 అడుగుల మేర ఎత్తారు. అయితే, వరద ఉధృతి తగ్గితే గేట్ రిపేర్‌పై ఫోకస్ పెట్టనున్నారు. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. అర్ధరాత్రి తుంగభద్ర డ్యాం 19వ గేట్ చైన్ వైర్ తెగిపోయింది. దీంతో అనుకున్న స్థాయికి మించి దాదాపు 35,000 క్యూసెక్కుల నీరు నదిలోకి ఎక్కువగా విడుదలవుతుంది. తుంగభద్ర డ్యామ్ కు మొత్తం 33 గేట్ లు ఉన్నాయి. 1953 నుంచి నీటిని నిలువ ఉంచుతున్న ఈ డ్యాంలో ఇలాంటి ప్రమాదం జరగటం ఇదే మొదటిసారి. గేట్ చైన్ తెగటం వలన ముంపు ప్రమాదం ఏమి లేదు కానీ నీళ్లు నదిలోకి వెళ్తున్నాయి. ఇలా డ్యామ్ గేట్ తెగిపోతే తాత్కాలికంగా "స్టాప్ లాక్ " గేట్ పెడతారు. స్టాప్ లాక్ గేట్ అంటే ఇనుప డోర్ లాంటిది. కింద నుంచి సెగ్మెంట్ లు పైకి పేర్చుకుంటూ వస్తారు.

తుంగభద్ర డ్యాం స్టోరేజి కెపాసిటీ 105 టీఎంసీలు. ప్రస్తుతం డ్యాం పూర్తి స్టోరేజీతో నిండుకుండలా ఉంది. స్టాప్ లాక్ గేట్ పెట్టాలి అంటే నీటి లెవెల్ తగ్గాలి, కచ్చితమైన లెక్క లేదు కానీ కనీసం 30 టీఎంసీల కన్నా దిగువకు వస్తే కానీ స్టాప్ లాక్ పెట్టే అవకాశం ఉండకపోవచ్చు. తుంగభద్ర నుంచి వచ్చే నీరు కర్నూల్ జిల్లా సుంకేసుల బ్యారేజి దాటి అలంపూర్ వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. తుంగభద్ర మీద సుంకేసుల వద్ద కేసి కెనాల్ మొదలవుతుంది. బనకచెర్ల వద్ద తెలుగు గంగ, నిప్పులవాగు ఎస్కేప్ ఛానల్, ఎస్సార్బీసీ, జీఎన్ఎస్ఎస్ లతోపాటు కేసీ కెనాల్ లకు కూడా దాదాపు పూరి సామర్థ్యంతో నీళ్లు వదులుతున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ కూడా దాదాపు పూర్తి కెపాసిటీతో ఉన్నాయి. ఒక్క పులిచింతల మాత్రం 10 టీఎంసీ కుషన్ ఉంది. తుంగభద్ర నుంచి కనీసం 30 నుంచి 40 టీఎంసీల నీరు వచ్చే అవకాశముంది. కాబట్టి, అన్ని కాలువలకు ఫుల్ కెపాసిటీ తో నీళ్లు వదలాలి. తుంగభద్రా డ్యాం నుంచి మొదలయ్యే హెచ్ఎల్సీ, ఎలెల్సీ కాలువల కింది అనంతపురం, పశ్చిమ కర్నూల్ రైతులకు ఈ ప్రమాదంతో నష్టం జరుగుతుంది. మల్యాల వద్ద ఉన్న హంద్రీ-నీవా లిఫ్ట్ ను పూర్తి కెపాసిటితో ఆపరేట్ చేసి జీడిపల్లి, గొల్లపల్లి డ్యాములు నింపే ప్రయత్నం చెయ్యాలి ప్రమాద తీవ్రత తగ్గి అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

స్పందించిన మంత్రి పయ్యావుల కేశవ్

తుంగభద్ర జలాశయం లోని 19వ గెట్ వైర్ తెగిపోవడంపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. అనంతపురం కర్నూలు జిల్లాలకు గుండెకాయ లాంటి తుంగభద్ర జలాశయంలో ఇలాంటి ప్రమాదం జరగటం రైతులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యాం కు సంబంధించి ఎంతో అనుభవం ఉన్న రిటైర్డ్ అధికారులతోనూ ప్రస్తుత అధికారులతోనూ చర్చించినట్లు తెలిపారు. వెంటనే నీరు వృథాగా నదిలోకిపోకుండా అవసరమైన చర్యలన్నిటిని త్వరగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులు ఆదేశించిందని వెల్లడించారు. పురాతన డ్యామ్ కావడంతో లాక్ సిస్టం కూడా వేయడం కష్టంగా ఉందని అన్నారు.

# హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు

## ఆదానీ గ్రూప్ స్టాక్స్‌కు భారీ కుదుపులు

న్యూఢిల్లీ,ఆగస్ట12(ఆర్ఎన్ఎ): అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు మరోసారి అదానీ గ్రూప్‌స్టాక్స్‌ను కుదిపేశాయి. ఈసారి అదానీ గ్రూప్ సంస్థలను నేరుగా లక్ష్యంగా చేసుకోనప్పటికీ.. గతంలో చేసిన ఆరోపణలకు కొనసాగింపుగా ఈసారి సెబీ చీఫ్‌ను ఈ వ్యవహారంలోకి లాగడం గమనార్హం. దీంతో అదానీ గ్రూప్ స్టాక్స్‌పై మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిన్తుండడంతో ఆ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఈ ఉదయం బీఎస్ఈలో ఏకంగా 17 శాతం మేర నష్టపోయింది. అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్డీటీవీ 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం చొప్పున నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ ఎంటర్ ప్రైజెస్ 5.43 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్ 2.53 శాతం, ఏసీసీ 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, తర్వాత కాస్త కోలుకున్నాయి. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలోని కొన్ని బెర్ముడా, మారిషస్ ఫండ్‌లలో సెబీ చీఫ్ మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లు 2015లో పెట్టుబడులు పెట్టారు. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్ల) వరకు ఉండొచ్చని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. 2017లో సెబీ పూర్తికాలపు సభ్యురాలిగా మాధబి నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ ఛైర్‌పర్సన్‌గా పదోన్నతి పొందారు. తమకు వాటాలున్న విదేశీ సంస్థలు కనుకే, అదానీ గ్రూప్‌పై సెబీ విచారణ తూతూమంత్రంగా జరిగేలా చేశారన్నది హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణ. దీన్ని సెబీ చీఫ్‌తో పాటు అదానీ గ్రూప్ కూడా ఖండించింది.

అయితే తమ ఆరోపణలను ఖండిస్తూ సెబీ చీఫ్ మాధబి బచ్ చేసిన ప్రకటన మరిన్ని సంక్లిష్ట ప్రశ్నలు లేవనెత్తుతోందని అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ పేర్కొంది. సెబీ చీఫ్ స్పందనపై ఆ సంస్థ ఆదివారం రాత్రి మరోసారి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించింది. మాధబి స్పందనలో ఆమెకు బెర్ముడా/మారిషస్ ఫండ్లు ఉన్నాయన్న విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయని పేర్కొంది. దీంతోపాటు ఆ ఫండ్స్‌ను ఆమె భర్త ధావల్ చిన్ననాటి మిత్రుడు నడుపుతున్న విషయం కూడా తేలిందని పేర్కొంది. ప్రస్తుతం అతడు అదానీ గ్రూపులో డైరెక్టర్‌గా చేస్తున్నారని వెల్లడించింది. అదానీ విషయంలో దర్యాప్తు చేసే బాధ్యతను సెబీకి అప్పగించారు. వాటిల్లో బచ్ వ్యక్తిగత పెట్టుబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉన్నాయని వెల్లడించింది. ఇది విరుద్ధ ప్రయోజనాల అంశం కిందకు వస్తుందని ఆరోపించింది. సెబీలో నియామకంతో ఆమె 2017లో స్థాపించిన కంపెనీలు నిద్రాణమైపోయాయని పేర్కొంది. 2019లో ఆమె భర్త సదరు సంస్థల బాధ్యతను స్వీకరించారని వెల్లడించింది. ఆ కంపెనీ ఇప్పటికీ మాధబి సొంత కంపెనీగా పేర్కొంది. కన్స్‌లెంగ్ రెవెన్యూను అది సంపాదిస్తోందని తెలిపింది. సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై అమెరికా షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ తాజాగా ఆరోపించింది. అదానీకి చెందిన మారిషస్, ఆఫ్‌షోర్ షెల్ సంస్థల వివరాలను తెలుసుకోవడంలో సెబీ ఆసక్తి చూపకపోవడం తమను ఆశ్చర్యపరిచిందని పేర్కొంది

# ఆళ్ల నాని బాటలో మరికొంత మంది

విజయవాడ, ఆగస్టు 12 ఆళ్ల నాని వైసీపీని ఎందుకు వీడారు? జగన్ పట్టించుకోలేదా? ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా? ఇంతటి చిన్న వయసులో రాజకీయ సన్యాసం ఎందుకు తీసుకున్నారు? క్రియాశీలక రాజకీయాలకు ఎందుకు గుడ్ బై చెప్పారు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే హాట్ టాపిక్ గా మారింది. ఆళ్ల నాని అంటే విధేయత, వివాదాలకు దూరంగా ఉండడం, అధినేతపై అపార నమ్మకం, చిన్న వయసులోనే డిప్యూటీ సీఎం హోదా దక్కించుకోవడం? ఇవన్నీ సానుకూలతలే. అసలు ఆళ్ల నాని రాజీనామా చేయాల్సిన అవసరమే లేదు. పెద్ద వివాదాస్పదమైన నేత కూడా కాదు. ప్రత్యర్థులతో మితిమీరిన శత్రుత్వం కూడా లేదు. అధికారంలో ఉన్నప్పుడుఅనవసర వ్యాఖ్యల జోలికి పోలేదు. ఇతరుల మాదిరిగా ప్రత్యర్థులను నిందించలేదు. అయినా సరే పార్టీని వీడారు. వేరే పార్టీలో చేరలేక రాజకీయ సన్యాసం చేశారు. యాక్టివ్ రాజకీయాలకు దూరమైనట్లు ప్రకటించారు. అయితే ఇందుకు కారణాలు మాత్రం తెలియడం లేదు. కానీ ముమ్మాటికీ జగన్ ఏ కారణం అన్న ఆరోపణ మాత్రం ఉంది. వాస్తవానికి జగన్ తన తొలి క్యాబినెట్లో ఆళ్ల నానిని తీసుకున్నారు. డిప్యూటీ సీఎం పదవి పోస్ట్ కట్టబెట్టారు. విస్తరణలో పదవి నుంచి తొలగించారు. అయినా ఆళ్ల నాని బాధపడలేదు. మొన్నటి ఎన్నికల్లో టిక్కెట్ విషయంలో సైతం జగన్ నాన్చుడు ధోరణితో వెళ్లారు. అయినా సరే ఎక్కడా అసంతృప్తి చెందలేదు. కానీ ఇప్పుడు వైసీపీ అధికారానికి దూరమయ్యేసరికి ఆళ్ల నాని రాజకీయాలకు గుడ్ బై చెప్పడం విశేషం. అయితే ఒక్క ఆళ్ల నాని మాత్రమే కాదు.. ఆయన బాటలో 30 నుంచి 40 మంది వైసీపీ నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సినీ నటుడు అలీ వైసీపీతో తనకు సంబంధం లేదని ప్రకటించారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధాలు లేవని చెప్పుకొచ్చారు. విజయవాడ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన కేశినేని నాని అయితే క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. మద్దాలి గిరి, కిలారు రోశయ్య, సిద్ధా రాఘవరావు.. ఇలా నేతలంతా పార్టీని వీడుతున్నారు. అయితే పార్టీని వీడుతున్న చాలామంది నేతలు క్రియాశీలక రాజకీయాలనుంచి దూరమవుతున్నట్లు ప్రకటించారు. అంటే ఎదుటి పార్టీలో అవకాశం లేకపోయి ఉంటుంది. లేకుంటే వైసీపీకి భవిష్యత్తు లేదన్న బెంగ అయినా ఉంటుంది. దీనివల్లే ఎక్కువమంది పార్టీకి గుడ్ బై చెబుతున్నారు కానీ.. రాజకీయాలు వదిలేశామని చెప్పుకొస్తున్నారుఅధికారం కోల్పోయిన తర్వాత అధినేత వైఖరిలో మార్పు వస్తుందని ఎక్కువ మంది భావించారు. తమ మాట వింటారని ఆశించారు. తమ అభిప్రాయాన్ని గౌరవిస్తారని అనుకున్నారు. ఈ విషయంలో జగన్ వైఖరి నచ్చకే ఆళ్ల నాని లాంటి నమ్మకస్తుడు.. వేరే పార్టీలో చేరక.. చేరలేక రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. పార్టీ పరిస్థితి, స్థితిగతులపై ఆళ్ల నాని ఇచ్చిన సలహాలను కనీస పరిగణలోకి తీసుకోలేదు జగన్. ఆ పరిణామంతోనే ఆళ్ళ నాని పార్టీకి దూరమైనట్లు తెలుస్తోంది. పార్టీలో ఎవరు ఉంటారో.. ఎవరు ఉండరో తెలియని పరిస్థితి. ఉన్నవారితో పార్టీని నడుపుకుంటానని జగన్ ధీమాతో ఉన్నారు. వైసీపీ ఏర్పాటు చేసినప్పుడు తాను, తనతో పాటు తన తల్లి విజయమ్మ మాత్రమే ఉన్నారన్న విషయాన్ని జగన్ గుర్తు చేస్తున్నారు. ఇద్దరితో ప్రారంభమైన వైసీపీ తొలుత బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. తరువాత అధికారంలోకి వచ్చింది. అటు తరువాత దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. అయినా సరే జగన్ లో ధీమా కనిపిస్తోంది. తప్పకుండా అధికారంలోకి వస్తానని.. ఉన్నవారు ఉండొచ్చని.. ఇష్టం లేనివారు పార్టీ నుంచి వెళ్ళిపోవచ్చు అన్న భావనతో ఉన్నారు. ఈ క్రమంలో ఆళ్ల నాని లాంటి విధేయత కలిగిన నేతలు వదులుకున్నారు. ముున్ముందు ఆళ్ల నాని బాటలో మరి కొంతమంది వైసీపీ నేతలు పయనించనున్నట్లు తెలుస్తోంది.

# ఎటూ కాకుండా పోయిన బైరెడ్డి



కర్నూలు, ఆగస్టు 12 వైసిపి హయాంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హంగామా అంతా అంతా కాదు. మంచి మాస్ ఇమేజ్ తో యువతరానికి ఆదర్శం అన్నట్టు ఆయన వ్యవహార శైలి ఉండేది. చుట్టూ మంది మార్బలంతో సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేసేవారు. నిత్యం యూట్యూబ్ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ నిత్యం ప్రచారంలో ఉండేవారు. యువనేత అంటే ఇలా ఉండాలి అనేటట్టు ప్రచారం కల్పించుకునేవారు. వైసీపీలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. అయితే అదంతా గాలి బుడగే అన్నట్టు ప్రస్తుతం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పరిస్థితి మారింది. ఇప్పుడు ఆయనను పట్టించుకునే వారు కరువయ్యారు. వెంట నడిచేందుకు సైతం అనుచరులు ఇష్టపడడం లేదు. రాష్ట్రంలో వైసిపి ఓడిపోవడంతో ఒక్కొక్కరు సిద్ధార్థ రెడ్డిని వదిలేసి ఇతర పార్టీలో చేరుతున్నారు. చివరకు ఒంటరిగా మిగిలిపోయారు సిద్ధార్థ రెడ్డి. ఆయన పరిస్థితి చూసి అంతా జాలి పడుతున్నారు. సోషల్ మీడియాలో సైతం సెటైర్లు పడుతున్నాయి. వాస్తవానికి నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. అక్కడ పోటీ చేసే ఛాన్స్ సిద్ధార్థ రెడ్డికి దక్కలేదు. గత రెండుసార్లు అక్కడ వైసీపీ ఎమ్మెల్యే గెలిచేసరికి అది తన చలువే అన్నట్టు సిద్ధార్థ రెడ్డి వ్యవహరించేవారు. మొత్తం నియోజకవర్గంలో ఎమ్మెల్యేను డమ్మీ చేసి అంతా తానై వ్యవహరించేవారు. దానికి తోడు 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో శాప్ చైర్మన్ పదవి సిద్ధార్థ రెడ్డికి వరించింది. దీంతో రాష్ట్రస్థాయి నాయకుడిగా చలామణి అయ్యారు సిద్ధార్థ రెడ్డి. కానీ ఇప్పుడు పార్టీ ఓడిపోవడంతో, పవర్ చేజారిపోవడంతో చుట్టూ ఉండేందుకు కూడా ఎవరు ఇష్టపడడం లేదు.నందికొట్కూరులో ఒక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు సిద్ధార్థ రెడ్డి. అయితే ఆయన బలానికి మించి సోషల్ మీడియాలో ప్రచారం జరిగేది. ఓ రేంజ్ లో ఆయన గురించి ఎస్టాబ్లిష్ చేసేవారు. సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ అయ్యేది. మరోవైపు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ప్రతినిధులను తన చెప్పు చేతల్లో ఉంచుకునేవారు సిద్ధార్థ రెడ్డి. వారంతా తనను చూసి, తన వెన్నంటి ఉండేవారని భావించారు. కానీ అధికారం దూరమయ్యేసరికి రెండు నెలల వ్యవధిలోనే ఒంటరిగా మిగిలారు సిద్ధార్థ రెడ్డినందికొట్కూరు మున్సిపాలిటీ నుంచి అప్పుడే టిడిపిలో చేరికలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ ఎన్నికల్లో నందికొట్కూరులో వైసీపీకి ఏకపక్ష విజయం దక్కింది. మొత్తం 29 కౌన్సిలర్లకు గాను.. 21 మంది వైసీపీ నుంచి గెలిచారు. ఏడుగురు ఇండిపెండెంట్లు విజయం సాధించగా.. టిడిపి నుంచి మాత్రం ఒక్కరే గెలుపొందారు. దీంతో తన అనుచరుడు సుధాకర్ రెడ్డికి చైర్మన్ చేశారు సిద్ధార్థ రెడ్డి. ఇప్పుడు అదే సుధాకర్ రెడ్డి టిడిపిలో చేరుతున్నారు. తన వెంట మెజారిటీ కౌన్సిలర్లను తెలుగుదేశం పార్టీలోకి తీసుకెళ్తున్నారు. దీంతో నందికొట్కూరు మున్సిపాలిటీ టిడిపి వశం అయ్యింది.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కేవలం వైసీపీ ఇన్చార్జిగా కొనసాగారు. శాప్ చైర్మన్ గా మాత్రమే నామినేట్ అయ్యారు. కానీ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బాబాయ్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి నంద్యాల ఎంపీగా గెలిచారు. ఎన్నికలకు ముందు టిడిపిలో చేరారు. నంద్యాల టికెట్ దక్కించుకొని ఎంచక్కా పార్లమెంట్ సభ్యురాలు అయ్యారు. కానీ వైసీపీ ఆవిర్భావం నుంచి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కనీసం ఎమ్మెల్యే కూడా కాలేకపోయారు. ఎన్నికల్లో జగన్ పెద్ద ఎత్తున అభ్యర్థులను మార్చారు. నందికొట్కూరు ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం నుంచి తను సూచించిన నేతకు జగన్ టిక్కెట్ ఇవ్వలేదు. తనకు సైతం ఇతర నియోజకవర్గాల్లో అవకాశం కల్పించలేదు. రెండిటికి చెడ్డ రేవడిగా మారిపోయారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి.

## ఏపీలో పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు

విజయవాడ, ఆగస్టు 12, తెలుగు రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు సాగిన ఉమ్మడి ప్రవేశాలకు జూన్ 2తో బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన ఈ రెండు విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 2నాటికి పదేళ్లు పూర్తయినందున అవి ఏపీలో సేవలను నిలిపివేశాయి. ఈ క్రమంలో పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు తెలంగాణ ప్రాంతానికి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఈ రెండు యూనివర్సిటీలలో ఈ విద్యాసంవత్సరం వరకు ప్రవేశాలను కొనసాగించాలని ఏపీ ఉన్నత విద్యాశాఖ ఇటీవల లేఖ రాసింది. దీనిపై ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనరాలేదు. దీంతో ఏపీలోనూ తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రెండు యూనివర్సిటీల ఏర్పాటుకు అయ్యే ఖర్చు ఎంత? మానవ వనరులు ఎంత అవసరమవుతాయి లాంటి అంశాలను ఉన్నత విద్యాశాఖ లెక్కలోకి తీసుకుంటుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఏపీలో శ్రీశైలం, కూచిపూడి, రాజమహేంద్రవరంలలో పీఠాలు ఉన్నాయి. వీటిద్వారా 200 మంది విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న కేంద్రానికి దాదాపు 35 ఎకరాల స్థలం ఉంది. అక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందనేది ప్రభుత్వ యోచనగా తెలుస్తోంది. ఏపీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలంటే దాదాపు 50 కోట్ల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని వర్సిటీలో ఉన్న కోర్సులన్నింటినీ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీచేయాల్సి ఉంటుంది.ఏపీలో కొత్తగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి రూ.63.85 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయిని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వర్సిటీలో 50 బోధన పోస్టులు, 68 బోధనేతర పోస్టులు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు యూనివర్సిటీ ప్రారంభించాలంటే.. అద్దె భవనంలో ఏర్పాటు చేసి, నిర్వహించాల్సి ఉంటుంది. సార్వత్రిక విశ్వవిద్యాలయం తరఫున ఏపీలో 76 దూర విద్య కేంద్రాలు ఉన్నాయి. డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో కలిపి ప్రస్తుతం లక్షన్నర మంది చదువుతున్నారు. ఏటా సుమారు 16 వేల మంది ప్రవేశాలు పొందుతున్నారు. ఫీజుల రూపంలోనే వర్సిటీకి ఏపీ నుంచి రూ.21 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఏపీ స్టడీ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బందికి జీతాల కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5.40 కోట్ల వరకు చెల్లిస్తోంది.

# సజ్జల డైరక్షన్ లోనే దువ్వాడ వ్యవహారం

శ్రీకాకుళం, ఆగస్టు 12 ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వ్యవహారం వీధిన పడింది. గత కొద్దిరోజులుగా మీడియాకు హాట్ టాపిక్ గా మారింది. రెండు రాష్ట్రాలకు వినోదం పంచుతోంది. అయితే ఎమ్మెల్సీ దువ్వాడ వైఖరి పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి కుటుంబంలో గొడవలు ఉంటాయని చెబుతున్న దువ్వాడ.. అందరూ తనలా వీధిన పడడం లేదన్న విషయాన్ని గుర్తుంచుకోలేకపోతున్నారు. భార్యాబిడ్డలపై కేసులు పెట్టరన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. నాలుగు గోడల మధ్య సమస్యను పరిష్కరించుకోవాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నారు. తాను ఒక నాయకుడినని.. తన కుటుంబ వివాదమే పరిష్కరించుకోలేని స్థితిలో దువ్వాడ ఉండడం విచారకరం. అయితే ఇంత జరుగుతున్నా.. దువ్వాడ శ్రీనివాస్ కు అండగా వైసీపీ నేతలు రంగంలోకి దిగడం లేదు. హై కమాండ్ ఇంతవరకు స్పందించలేదు. తమ పార్టీ నేత కుటుంబం రోడ్డున పడింది.మీడియాకు ఎక్కింది.పార్టీని చులకన చేస్తోంది.ఇవేవీ అధినేత జగన్ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదే దువ్వాడ జగన్ కుటుంబం పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. దీటైన సమాధానం చెప్పేవారు. ఎంతలా అంటే జనసేన అధినేత పవన్ కు చెప్పు చూపేటంతగా.కానీ ఇప్పుడు అదే దువ్వాడ కుటుంబ కష్టాల్లో ఉంటే.. జగన్ తన కష్టం కాదన్నట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇటువంటి వాటికి ఫుల్ స్టాప్ పెట్టాలన్న ఆలోచన కూడా చేయకపోవడం పార్టీ శ్రేణులకు ఆందోళన కలిగిస్తోంది. దువ్వాడ ఒక మూర్ఖుడిలా వ్యవహరిస్తున్నారు. ఆయనను నియంత్రించాల్సిన హైకమాండ్ పట్టించుకోవడం లేదు. దీంతో క్యాడర్ అంతా తెలుగుదేశం పార్టీ వైపు చూస్తోంది.మంత్రి అచ్చన్న గేట్లు తెరిచిన మరుక్షణం టెక్కలి లో వైసీపీ ఖాళీ కావడం ఖాయం.వాస్తవానికి దువ్వాడ శ్రీనివాస్ ఓ మహిళతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని గత మూడేళ్లుగా శ్రీకాకుళం జనాలకు తెలుసు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అధికారాన్ని చలాయించారు దువ్వాడ. కేవలం కింజరాపు కుటుంబం పై దువ్వాడను ప్రోత్సహించారు జగన్. అధికారాన్ని తలకెక్కించుకున్న దువ్వాడ ఇష్టా రాజ్యంగా చెలాయించారు. చివరకు ఒక మహిళ ట్రాప్ లో పడ్డారు. దువ్వాడ తన ఇంటికి వెళ్లకుండా ఆ మహిళతోనే ఉంటున్నారు అన్న విషయం అందరికీ తెలిసిందే.కానీ పార్టీ కట్టడి చేయలేదు. దువ్వాడ భార్యాబిడ్డల ఆందోళనను గమనించలేదు. కుటుంబ వ్యవహారాన్ని వ్యాపార కోణంలో చూశారు.ప్రజా జీవితంలో ఉన్న వారి వ్యక్తిగత వ్యవహార శైలిని అందరూ చూస్తారు. అంతెందుకు ఇదే దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి అనరాని మాటలను అన్నారు.

హిందూమతం ఏకపత్ని విధానం గురించి మాట్లాడారు. పవన్ ను నీచుడితో పోల్చారు. కానీ అదే పవన్ విడాకులు తీసుకున్నాక.. వారి సమ్మతంతోనే వివాహాలు జరుపుకున్నారు అన్న విషయాన్ని మరిచిపోయారు. పెళ్లి ఈడుకు వచ్చిన ఇద్దరు పిల్లలు ఉన్నారు అన్న విషయాన్ని గ్రహించుకోలేక.. వేరే మహిళతో సన్నిహిత్యంగా ఉన్నానన్న విషయాన్ని తానే ఒప్పుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అలా చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు.అయితే దువ్వాడ కుటుంబ వ్యవహారానికి ముమ్మాటికీ సజ్జలే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. దువ్వాడ వ్యవహార శైలి పై ఫిర్యాదులు వచ్చాయి. ఆయన భార్య వాణి ఫిర్యాదు చేశారు. న్యాయం చేయకుంటే ఆత్మహత్య శరణ్యమని చెప్పుకొచ్చారు. అయితే అప్పట్లో ఆస్తులు పిల్లలిద్దరికీ పంపకాలు చేపడతారని.. వైసీపీ టికెట్ మీదేనంటూ చెబుతూ ఇంచార్జ్ పదవి అప్పగించారు. కానీ ఆస్తులు రాయలేదు. ఇచ్చిన ఇన్చార్జి పోస్టు తీసేసారు. ఇండిపెండెంట్ గా పోటీ చేస్తానన్న వాణిని సముదాయించారు. ఇప్పుడు ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో వాణిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పుడు అదే మహిళతో బహిరంగంగానే తిరగడం ప్రారంభించారు దువ్వాడ. ఇంతటి వివాదానికి సజ్జలే కారణమని వాణి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ ఇంతవరకు వైసీపీ నుంచి ఈ వ్యవహారంపై ఎటువంటి ప్రకటన రాలేదు.

# భయం..భయంగా వైసీపీ నేతలు

విజయవాడ, ఆగస్టు 12 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి పార్లమెంటు ఎన్నికలతోపాటు మూడు నెలల క్రితం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. వైనాట్ 175 నినాదంతో ప్రజల్లోకి వెళ్లిన జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని ప్రజలు కేవలం 11 స్థానాలకు పరిమితం చేశారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. కూటమికి ఏకంగా 166 సీట్లతో తిరుగులేని మెజారిటీ కట్టబెట్టారు. దీంతో ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీలో కీలకంగా వ్యవహరించిన నేతలంతా ఇప్పుడు సైలెంట్ అయ్యారు. కనీసం నియోజకవర్గాల్లో కూడా కనిపించడం లేదు. సొంత వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. ఇక అధికార కూటమి నేతలు గతంలో తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై ప్రతీకారం తీర్చుకుంటున్నారు. దీంతో వైసీపీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఒకవైపు చూస్తే పార్టీకి గౌరవ ప్రదమైన సీట్లు లేవు.. ఇంకోవైపు అధికార కూటమి ఇరు రాష్ట్రంలో.. అటు కేంద్రంలో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వైసీపీ తరఫునా మాట్లాడినా ఇబ్బందే అన్న భావనలోచాలా మంది సైలెంట్ అయ్యారు. ఇక అధికారం లేకుండా ఐదేళ్లు ఎలా ఉండాలన్న ఆలోచనతో చాలా మంది అధికార కూటమి పార్టీలవైపు చూస్తున్నారు. అయితే కూటమి నేతలు కూడా చేరికల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు పూర్తిగా రాజకీయాల నుంచే తప్పుకుంటున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చారు. విపక్ష నేతలపై అక్రమంగా కేసులు పెట్టించారు. అరెస్టులు చేయించారు. మాట వినని వారిని అంతం చేశారు. దీంతో ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ?జనసేన?బీజేపీ కూటమి నేతలు కూడా అదే పంథాలో ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా వైసీపీ పాలనలో ఇబ్బంది పడ్డ టీడీపీ నేతలు తమను వేధించిన వారిపై కక్ష తీర్చుకుంటున్నారు. నాడు అధికారం ఉందని ఇష్టానుసారం వ్యవహరించిన, మాట్లాడిన నేతలు ఇప్పుడు వైసీపీలో ఉండడానికి కూడా భయపడుతున్నారు. దీంతో రాజకీయాల నుంచే తప్పుకోవాలని నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికలకు మూడు నెలల ముందు టీడీపీని వీడి వైపీపీలో చేరిన విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని.. మొన్నటి ఎన్నికల్లో కూడా ఎంపీగా పోటీ చేశారు. సొంత సోదరుడి చేతిలో ఓడిపోయాడు. దీంతో ఇప్పుడు రాజకీయాల నుంచే తప్పుకున్నారు.ఇప్పుడు వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆళ్ల నాని , ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ కూడా కేశినేని నాని బాటలో నడిచారు. ఏలూరు జిల్లా వైసిపి అధ్యక్ష పదవికి, నియోజకవర్గం ఇన్‌చార్జి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల చేతనే వైసీపీకి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మాజీ మంత్రి మంత్రి ధర్మాన ప్రసాదరావు రాజకీయాల నుంచి తప్పుకోబోతున్నట్లు చెప్పగా, ఇటీవలే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వైసీపీకి రాజీనామా చేశారు. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి వేటాడాలనే జగన్ ఎంచుకున్న విధానం వలననే నేడు వైసిపి నేతలకు ఈ దుస్థితి కలిగిందని చెప్పక తప్పదు. ఇది వీళ్లకే పరిమితమయ్యే పరిస్థితి లేదు.. ఇప్పటికే కొడాలి నాటి, రోజాతోపాటు చాలా మంది మాజీ మంత్రులు సైలెంట్ అయ్యారు. దీంతో రాబోయే రోజుల్లో చాలా మంది రాజకీయాల నుంచి తప్పుకోవడం ఖాయం. ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే.. అధికార కూటమి లోకి వెళ్లే అవకాశం ఉండేది. ఎమ్మెల్యే పదవి కూడా లేకపోవడంతో అటు కూటమి పార్టీలు కూడా వీరిని పట్టించుకునే పరిస్థితి లేదు. ఇటు ఐదేళ్లు అధికార పార్టీ వేధింపులు ఎదుర్కొంటూ ఉండలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో చాలా మంది రాజకీయాలకు స్వస్తి చెబుతారని నిపుణులు పేర్కొంటున్నారు.

# 16న శ్రీవారి పాదాల చెంతఛత్రస్థాపనోత్సవం

## గొడుగును ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు

తిరుమల,ఆగస్ట్12: తిరుమలలోని నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత ఆగస్టు 16వ తేదీన ఛత్రస్థాపనోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా అర్చక బృందం శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా శ్రావణ శుద్ధ ద్వాదశినాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తారు.ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు.ఛత్రస్థాపనోత్సవం కొన్ని వందల సంవత్సరాలుగా జరుగుతోంది. ఇందులో భాగంగా నారాయణగిరిలోని శ్రీవారి పాదాలకు తిరుమంజనానికి నిర్వహించేందుకు ఆలయంలోని బంగారు బావి నుండి తీర్థాన్ని తీసుకుంటారు. తిరుమల శ్రీవారి ఆలయంలో రెండవ గంట తర్వాత పూజ సామాగ్రి, పుష్పాలు, నైవేద్యానికి ప్రసాదాలు సిద్ధం చేసుకుంటారు. రంగనాయకుల మండపం నుండి గొడుగులతో మంగళవాయిద్యాల నడుమ మహాప్రదక్షిణంగా మేదరమిట్ట చేరుకుంటారు. అక్కడినుండి అర్చకులు నారాయణగిరి శిఖరం చేరుకుని బంగారుబావి నుండి తెచ్చిన తీర్థంతో శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, అలంకారం, పూజ, నైవేద్యం సమర్పిస్తారు. తదనంతరం వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించి, శ్రీవారి పాదాల చెంత గొడుగును ప్రతిష్టించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు.

# బతుకమ్మ చీరల స్థానంలో బహుమతులు

కరీంనగర్, ఆగస్టు 12 (న్యూస్ పల్స్)తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగలు బతుకమ్మ, దసరా, బోనాలు. రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాల ప్రజలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనే పండుగలు ఇవీ. అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఈ పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ కూడా కీలక పాత్ర పోషించింది. కేసీఆర్ తనయ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జాగృతి పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తం చేసింది. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మలు ఆడుతూ ఆందోళనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. బోనాలు ఎత్తిన రోజులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ తెలంగాణ వచ్చాక బతుకమ్మ, దసరా, బోనాల పండుగలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభించారు. ఇక బతుకమ్మ అంటేనే అమ్మవారు. అమ్మవారి స్వరూపమైన ఆడ పడుచులకు బతుకమ్మ సందర్భంగా చీరలు పంపిణీ చేసే కార్యక్రమానికి కూడా కేసీఆర్ శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు, అదే సమయంలో బతుకమ్మ పండుగ వేళ.. ధనిక, పేద అని తేడా లేకుండా ఆడపడుచులంతా కొత్త బట్టలు కట్టుకోవాలన్న ఉద్దేశంతో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. రేషన్ కార్డులో పేరు ఉన్న మహిళలందరికీ చీరలు పంపిణీ చేస్తూ వచ్చారు. 2023 బతుకమ్మ పండుగ సంరర్భంగా కూడా చీరలు పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ తర్వాత పంపిణీ ఆపేశారు. అయితే ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. బతుమక్మ చీరల పంపిణీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఉచితంగా అందిస్తున్న చీలర పంపిణీ నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. చీరల తయారీకి ఇప్పటి వరకు ఆర్డర్ ఇవ్వలేదు. దీంతో పంపిణీ లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ చీరల పంపిణీ పెద్ద గోల్‌మాల్ పథకమని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపించారు. దీంతో బతుకమ్మ చీలర పథకం స్థానంలో మరో స్కీమ్ తీసుకురావాలని రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఇప్పటికే నిర్ణయానికి వచ్చింది.

# క్రైమ్ సిటీగా మారుతున్న టెంపుల్ సిటీ

తిరుపతి, ఆగస్టు 12 టెంపుల్ సిటీలో క్రైమ్ రేట్ పెరిగిపోవడంతో జనంలో ఆందోళన నెలకొంది. వరుస హత్యలు, దాడులతో ఆధ్యాత్మికతకు మచ్చగా మారుతోంది. ఈ మధ్య కాలంలో వరుసగా జరుగుతున్న ఘటనలు ఇందుకు అద్దం పడుతోంది. గంజాయి మత్తులోనే యువత నేరాలకు పాల్పడుతున్నట్లు స్పష్టం అవుతోంది. 4రోజుల క్రితం తిరుపతిలోని సుందరయ్య నగర్?లో మైనర్ బాలిక ప్రేమ వ్యవహారంలో జరిగిన ప్రేమోన్మాద దాడి టెంపుల్ సిటీని ఉలిక్కిపడేలా చేసింది. ఈ క్రమంలోనే డ్రగ్ కల్చర్ కొనసాగుతుందన్న విషయం వెలుగులోకి వచ్చింది. సుందరయ్య నగర్?లో ఒక మైనర్ బాలికపై జరిగిన దాడి గంజాయి మత్తులోనే జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు టెంపుల్ సిటీలో చర్చగా మారింది. పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను సుందరయ్య నగర్?కు చెందిన బాలు అనే యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. అదే క్రమంలో జరిగిన దాడిపై బాలిక తల్లి సుందరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఉపాధి కోసం కువైట్?కు వెళ్లిన సుందరి మైనర్ కూతురు, కొడుకును సుందరయ్య నగర్?లోని తల్లి ముత్యాలమ్మ సంరక్షణలో పెట్టి చదివిస్తోంది. గత కొద్దికాలంగా సుందరయ్య నగర్?కి చెందిన బాలు అనే యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు తెలుసుకుని.. సుందరి కుటుంబ సభ్యులు వారించే ప్రయత్నం చేశారు. కూతురు ప్రేమ విషయం తెలుసుకొని కువైట్ నుంచి తిరిగి వచ్చిన తల్లి సుందరి.. బాలు అనే యువకుడి నిర్వాకంపై నిలదీసింది. సుందరి కొడుక్కి, బాలు అనే యువకుడికి మధ్య ఈ వ్యవహారంపై ఘర్షణ కూడా జరిగింది. మైనర్ బాలిక ప్రేమ వ్యవహారం రెండు రోజుల క్రితం కత్తులతో దాడికి దారి తీసింది. మైనర్ బాలిక అన్నకు.. బాలు బ్యాచ్ తో జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది.మైనర్ బాలిక తల్లి సుందరి, మేనమామ సురేష్??, బాలు తమ్ముడు లోకేష్ కత్తిపోటుకు గురయ్యారు. ఇలా రెండు కుటుంబాల్లో ముగ్గురు గాయపడ్డారు.ఈ గొడవపై ఇరు వర్గాల ఫిర్యాదులతో తిరుపతి ఈస్ట్ పిఎస్ లో కేసులు కూడా నమోదు అయ్యాయి. అయితే మైనర్ బాలిక ప్రేమ వ్యవహారం, జరిగిన దాడులు గంజాయి మత్తే కారణమంద విమర్శలు ఉన్నాయి. గంజాయి, డ్రగ్స్ ముఠానే తన కూతురిని ట్రాప్ చేసేందుకు కారణమని తల్లి సుందరి అరోపిస్తోంది. అయితే అన్న బాలు బ్యాచ్ ఆగడాలను కూడా కొందరు వెలుగులోకి తెచ్చారు. మైనర్ బాలిక అన్న బాలుకు గంజాయి, డ్రగ్స్ అలవాటున్నట్లు ఆ బ్యాచ్ పై ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి వరుస ఘటనలు తిరుపతిలో భయాన్ని కలిగిస్తున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో డ్రగ్ కల్చర్ పెరిగిందని, గంజాయి మత్తుకు యువత బానిసవుతోందని కొందరు మహిళలు ఆరోపిస్తున్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది. టెంపుల్ సిటీలో ఇలాంటి కల్చర్ వెంటనే నిరోధించాలంటు న్నారు స్థానికులు.ఇక పోలీసు యంత్రాంగం గంజాయి అమ్మకం, వినియోగాన్ని కట్టడి చేయలేకపోతోంది. విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న గంజాయిపై ఉక్కు పాదం మోపలేకపోతోంది. తక్కువ ధరకు ఈజీగా దొరుకు తుండడంతో మైనర్ల జీవితం కూడా గంజాయితో ముడి పడిపో తుంది. అరకు టు చెన్నై, వేలూరు, బెంగళూరు వయా రేణిగుంట, తిరుపతి మీదుగా జరుగుతున్న గంజాయి సప్లై ఇలాంటి ఘటనలకు కారణం అవుతోంది. దీంతో మైనర్లు, స్టూడెంట్లు డ్రగ్ కల్చర్?ను స్వాగతిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇలా గంజాయికి బానిసలు అవుతున్న యువతపై నిఘా పెట్టిన తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం కట్టడి చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ర్పాటు చేసింది.ప్రజల సహకారం ఉంటే తప్ప నిర్మూలించలేమని చేతులెత్తేస్తున్న పరిస్థితి నెలకొంది.గంజాయిఅమ్మకం,వాడకంపై సమాచార మిచ్చి సహకరించాలని స్థానికులను కోరుతోంది పోలీసు యంత్రాంగం.

# 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు

విజయవాడ, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాదర్బార్ మొదలు పెట్టారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు.. వారి నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగానే మంత్రులు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారానికి రెండ్రోజులు? టైమ్ టేబుల్ వేసుకుని మరీ ఉంటున్నారు. సీఎం చంద్రబాబు సైతం తనవంతుగా వెళ్లి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు స్వీకరించారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నడుస్తున్న ఈ ప్రజాదర్బార్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు పోటెత్తాయి. రాష్ట్ర నలుమూలల నుంచి 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు రావడం చర్చనీయాంశమైంది.ఇక ఈ ఫిర్యాదుల్లో ఎక్కువశాతం రెవెన్యూ సంబంధిత సమస్యలే ఉన్నట్లు తెలుస్తోంది. భూ ఆక్రమణ కేసులు, భూ కబ్జా కేసులే అధికంగా ఉన్నట్లు సమాచారం. అలాగే గ్రామాల్లోని త్రాగునీటి సమస్యలపైనా పెద్ద ఎత్తున ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపైనా అర్జీలు అందినట్లు అధికారులు చెబుతున్నారు.

# సిద్ధమైన అన్న క్యాంటీన్లు

## ఐదు సంవత్సరాల తర్వాత పూర్వ వైభవం

బద్వేలు,అన్న క్యాంటీన్లు.... కేవలం ఐదు రూపాయలకే పట్టెడు అన్నం పెట్టి పేదల ఆకలి తీర్చిన అక్షయపాత్రలు కేవలం 15 రూపాయలకే మూడు పూటలా కడుపు నింపే అన్నా క్యాంటీన్లు గత వైసిపి ప్రభుత్వ కక్ష సాధింపులకు బలయ్యాయి ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో పేదలకు అన్నం దక్కకుండా చేశాయి ఐదు సంవత్సరాలు పాటు అన్నా క్యాంటీన్లకు పట్టిన గ్రహణం ఇప్పుడు వీడింది కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలైంది ఈనెల 15 తేదీ రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా 100 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారు అందులో భాగంగా కడప జిల్లా బద్వేల్ లో కూడా అన్నా క్యాంటీన్ ముస్తాబయింది ఉమ్మడి కడప జిల్లాలో వేలాదిమంది పేదల ఆకలి తెచ్చేందుకు ప్రభుత్వం2018 జులై 11వ తేదీ అన్నా క్యాంటీన్లు ప్రారంభించింది జిల్లాలో కార్పొరేషన్ తో పాటు మున్సిపాలిటీల్లో మొత్తం 8 క్యాంటీన్లు ఏర్పాటు చేసింది కడప నగరంలో మూడు రాజంపేట ప్రొద్దుటూరు రాయచోటి పులివెందుల బద్వేలు జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు వీటి ద్వారా ప్రతిరోజు వేలాదిమంది పట్టణ పేదలకు ఐదు రూపాయలకే టిఫిన్ భోజనం లభించేది గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినసరి కూలీలకు మధ్యాహ్నం అన్నా క్యాంటీన్లు ఆకలి తీర్చేది వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారి కూడా మధ్యాహ్నం పూట అన్న క్యాంటీన్లలో అన్నం లభించడంతో వారికి ఆర్థిక భారం తగ్గేది ఇలా ప్రతిరోజు అన్నా క్యాంటీన్ లో భోజనం లభించేది తిరిగి ఇప్పుడు అలాంటి భోజనం లభించే అవకాశం రావడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

## విద్యార్థులకు అభినందనలు.




విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రమైన రుద్రవరంలో కేజీబీవీ లో సోమవారం ఎస్ఓ లక్ష్మీదేవి, ఉపాధ్యాయ బృందం 20 మంది విద్యార్థినీలను అభినందించారు. ఆదివారం ఉమ్మడి జిల్లాల పరిధిలోని గార్గేయపురంలో విద్యార్థినీలకు తాడాటలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఆ పోటీలో రుద్రవరం కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చాటి మొదటి స్థానంలో 10 మంది, ద్వితీయ స్థానంలో 10 మంది పథకాలు సాధించారు. వారిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## పంచాయతీల అభివృద్ధికి పాటుపడండి.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశీలకుడు.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కలిసిమెలిసి అభివృద్ధి బాట పట్టించాలని శిక్షణా తరగతుల జిల్లా పరిశీలకుడు రత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీల నిర్వహణపై శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న శిక్షణా తరగతుల జిల్లా పరిశీలకుడు రత్నం మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులు, విధులు బాధ్యతల పై అవగాహన పెంచుకోవాలన్నారు. వారంతా సమన్వయంతో మెలుగుతూ త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య మెరుగుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి శ్రీనివాస శర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ రెడ్డి.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-రుద్రవరం ఎంపీడీవో గా మధుసూదన్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికలకు ముందు అప్పటి అధికారులు ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం వారందరినీ తిరిగి సొంత జిల్లాలకు పంపించారు. ఇందులో భాగంగానే మధుసూదన్ రెడ్డి రుద్రవరం ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించారు.

## తహశీల్దార్ ను సన్మానించిన రేషన్ డీలర్లు.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-రుద్రవరం మండల నూతన తహశీల్దార్ మల్లికార్జున రావు ను మండలంలోని రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను ఘనంగా పూలమాలవేసి, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ సభ్యులు టంగుటూరి మురళీకృష్ణ, ఏరువ కృష్ణమూర్తి, బద్రి నారాయణ, లక్ష్మి రెడ్డి, గఫూర్, యశ్వంత్, సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, తిరుపాల్ రెడ్డి, ఓబన్న, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



## రీ ఓపెన్ కాకుండా ప్రజల సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలి

ఫిర్యాదుల పరిష్కారాన్ని అధికారులు సీరియస్ గా తీసుకోకపోతే చర్యలు తప్పవు
జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





కర్నూలు,ఆగస్టు, 12 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులు రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి ఆన్లైన్ ద్వారా వచ్చిన వినతులను గంటకోసారి ఓపెన్ చేసి చూసి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని శాఖల అధికారులు వచ్చిన వినతులను ఓపెన్ చేసి చూడడం కూడా చేయలేదన్నారు... సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కు సంబంధించి 3, ఆర్డబ్ల్యూఎస్ కు సంబంధించి 3, సివిల్ సప్లైస్ కు సంబంధించి 3, సహకార శాఖకు సంబంధించి 3, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కు సంబంధించి 3, కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించి 2, మున్సిపాలిటీ (లక్ష్మీపురం-2) కు సంబంధించి 2, గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి 2 దరఖాస్తులను ఇంత వరకు సంబంధిత శాఖల అధికారులు (ఎవబి బినీ లతివలి) ఓపెన్ చేసి చూడలేదన్నారు..ఫిర్యాదుల పరిష్కారాన్ని అధికారులు సీరియస్ గా తీసుకోవాలన్నారు.. లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.. చూడని వాటిని ఓపెన్ చేసి సాయంత్రం లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.... అదే విధంగా ఎట్ టు వ్యూ (జవబి బినీ ఎతివలి), బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెన్ అర్జీల పై సమీక్షిస్తామని, రీఓపెన్ అర్జీల పై సంబంధిత అధికారులు కారణాలు తెలపాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు..గడువు లోపు వినతులను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..ఆర్డీవో కార్యాలయాలు, పౌరసరఫరాల శాఖలో గడువు దాటిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు..రీఓపెన్ కేసులకు సంబంధించి ల్యాండ్ సర్వే శాఖలో ఒక దరఖాస్తు, డిపిఓ కు సంబంధించి 3 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని అందుకు తగిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే అధికారులు ముందుగా ప్రతి శనివారం పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులు ఓపెన్ చేసి చూశారా లేదా ? చేసి ఉంటే దరఖాస్తును పరిష్కరించారా లేదా ? రీఓపెన్ ఏమైనా అయ్యిందా అని పూర్తి స్థాయిలో సమీక్షించుకొని కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.×కార్యక్రమంలో డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ ద్వారా చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం





కర్నూలు,ఆగస్టు, 12 : నులిపురుగుల నివారణ కోసం చిన్నారులకు ఇచ్చే ఒక్క అల్బెండజోల్ మాత్ర వారికి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు తోడ్పడుతుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్య, అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రతి సంవత్సరం రెండు సార్లు (ఫిబ్రవరి 10వ తేది, ఆగస్టు 10వ తేదిలలో) నిర్వహించడం జరుగతుందన్నారు. ఇది 18వ విడత కార్యక్రమం అని ఇందులో భాగంగా రెండవ సారి ఆగస్టు 20వ తేదిన ఈ మాత్రలను అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు (ప్రభుత్వ మరియు ప్రైవేటు), జూనియర్ కళాశాలు, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న చిన్నారులు, విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు (అల్బెండజోల్) అందజేయాలన్నారు. 1సం. నుండి 2సం.లు ఉన్న చిన్నారులకు భోజనం తరువాత అల్బెండజోల్ సగం మాత్ర, 3సం.ల నుండి 19సం.ల విద్యార్థులకు అల్బెండజోల్ ఒక మాత్ర భోజనం అనంతరం అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ నులి పురుగుల వల్ల ఆహారం జీర్ణం కాకపోవడం, రక్తహీనత తదితర అనారోగ్య రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మాత్రలను తీసుకోవడం వల్ల రక్తహీనతను నిర్మూలించడంతో పాటు పోషకాహార ద్వారా వ్యాధినిరోధక శక్తిని మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ముఖ్యంగా ఈ నులిపురుగులు అపరిశుభ్రమైన ఆహారం, కలుషితమైన నీరు తీసుకోవడం వల్ల నులి పురుగులు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ఒకవేళ ఆగస్టు 20వ తేది పొరపాటున సదరు మాత్రలు తీసుకొని వారికి మరల ఆగస్టు 28వ తేదిన మాప్-అప్ కార్యక్రమం ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. జ్వరం ఉన్నపుడు ఈ మాత్రలను తీసుకోకూడదన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండలజోల్ మాత్రలు తీసుకున్న పిల్లలు స్కూల్లోనే రెండు గంటల పాటు ఉంచుకోవాలన్నారు. మండల కేంద్రాలకు పంపిణీ చేసిన అల్బెండజోల్ మాత్రలను ఎంపిడిఓల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలకు, పిహెచ్సి కేంద్రాలకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మాత్రలు తీసుకోవడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చిన ఉన్న వైద్యు సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.×సమావేశంలో డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, ఇంఛార్జి డిఎంహెచ్ఓ భాస్కర్, ఆర్బిఎస్కే కో-ఆర్డినేటర్ డా.హేమలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం...

కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్



కర్నూలు ఆగస్టు 12: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 115 ఫిర్యాదులు .ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గిడ్డయ్య అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 1 లక్ష 50 వేలు తీసుకొని మోసం చేశాడని, డబ్బులు అడిగితే ఇస్తానని చెప్పి , ప్రామిసరి నోటు రాసి ఇచ్చి మోసం చేస్తున్నాడని కర్నూలు , ప్రకాష్ నగర్ కు చెందిన ప్రకాష్ ఫిర్యాదు చేశారు. 2) నా కుమారుడు భువన్ కుమార్, కోడలు జ్యోతి నన్ను దుర్భాషలాడుతూ , వికలాంగుడైన తన తమ్ముడి ని కొడుతూ, అతని ఆస్తి కూడా తీసుకోవాలని, మమ్మల్ని మానసికంగా ప్రతి రోజు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు, జనార్ధన్ నగర్ కు చెందిన లక్ష్మీ దేవి ఫిర్యాదు చేశారు. 3) నాకు కుమార్తెలు పుట్టారని , నా భర్త బసవరాజు మమ్మల్ని పట్టించుకోకుండా నన్ను నా పుట్టింట్లోనే వదిలేసినాడని నాకు న్యాయం చేయాలని సి.బెళగల్ కు చెందిన అరుణమ్మ ఫిర్యాదు చేశారు. 4) కోడుమూరు - వెంకటగిరి రోడ్డు లో ఉన్న మా స్థలాన్ని నాగ భూషి లక్ష్మన్న ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కోడుమూరు వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ లక్ష్మమ్మ, గిడ్డయ్యలు ఫిర్యాదు చేశారు. 5) ఖమ్మం జిల్లా నివాసి, జాకిరుల్లా కి చెందిన ఆల్ బర్కత్ ఎలక్ట్రో మెకానికల్ కంపెనిలో పెట్టుబడులు పెట్టాము, అది ఒక బోగస్ సంస్థ అని , నేను మోసపోయా నని నాకు న్యాయం చేయాలని కర్నూ లు, గడ్డ స్ట్రీట్ కు చెందిన మహమ్మద్ అలీం ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ హామీ ఇచ్చారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులకు అభినందనలు ప్రిన్సిపల్



సంజామల / ఆగస్టు 12 శ్రీ ప్రస్థానం న్యూస్: మండల కేంద్రమైన సంజామల గ్రామంలో కేజీబీవీ లో ఆగస్టు నెల 11వ తారీఖున గర్గేయ పురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీ లేక తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఐశ్వర్య, నాగ తాప్సీ, గురు హర్షిత, కీర్తన, స్వరూపణ ఆమె అభినందించారు. వీరి ప్రతిభకు కృషిచేసిన పిడి ప్రిన్సిపల్ శ్రీలేఖ ప్రత్యేకంగా అభినందించారు

## సమస్యలు పరిష్కరించాలి.

తహశీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడి ఉద్యోగులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ ఉద్యోగులు ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ మల్లికార్జున రావుకు అందజేశారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా తాము ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ వేతనాలు పెరగడం లేదన్నారు. పని భారం ఎక్కువ అయిందని కూటమి ప్రభుత్వం వచ్చాక ఒత్తిడిలు అధికమయ్యాయని వాపోయారు. అయితే ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సమ్మెకు సంబంధించిన జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ ఆ ఆమీ నెరవేర్చలేదని అన్నారు. కావున కూటమి ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26 వేలకు పెంచాలని బాల సంజీవని మేమో చార్జీలు పెంచాలని సమావేశాలకు వెళితే టి ఏ, డి ఏ లు చెల్లించాలని తదితర డిమాండ్లతో వినతి పత్రాన్ని తహశీల్దార్ కు అందజేశామని తెలిపారు.

### నూతన పదవి బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ మల్లికార్జున రావు ను మర్యాదపూర్వకంగా కలిసిన. దళిత సంఘ నాయకులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూతన తహశీల్దారుగా పదవీ బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరావును సోమవారం ఏపి దళిత సమైక్య జిల్లా ఉపాధ్యక్షులు బుట్టి హుస్సేన్ గుర్రప్ప, దళిత సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపోగు నరసింహులు మర్యాదపూర్వకంగా పూలమాలవేసి ఆయనను సన్మానించారు.

## గ్రామ పంచాయితీల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలి.

మండల ఎంపిడిఓ, శ్రీనివాసులు.

దొర్ని పాడు, ఆగస్టు:12, శ్రీ ప్రస్థానం న్యూస్:- గ్రామ పంచాయితీల అభివృద్ధి కోసం ఆయా గ్రామాల్లోని పంచాయితీ కార్యదర్శి,లు సర్పంచ్ లు సమన్వయం తో గ్రామ పంచాయితీల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలని మండల ఎంపీడీఓ.శ్రీనివాసులు తెలిపారు.. సోమవారము స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ.అధ్యక్ష జరిగిన గ్రామాలభివృద్ధి ప్రణాళిక నివేదికల తయారీ పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్నట్టు వంటి మంచి నీటి సమస్య, డ్రైనేజీ, వీధి దీపాలు, సి. సి. రోడ్ల నిర్మాణం,తదితర అభివృద్ధి పనుల గుర్తించి వాటికి సంబందించిన సమగ్రమైన నివేదికలను తెలియజేయాలని ఆయన సర్పంచ్,లకు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బాలాంజ నేయులు, పంచాయతీ కార్యద ర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757